## కథ

# చేనుమేసిన కంచె

మేరెడ్డి యాదగిరిరెడ్డి

ప్రియాంకంటే అందరికీ ఇష్టం.

విద్యార్థులకు టీచర్లకు ఇష్టం.

పదవ తరగతి చదివే ప్రియాంక అన్నిట్లో ఫస్ట్.

ఆ ఊరి వాళ్లకు ఆ అమ్మాయంటే ఎంతోఇష్టం.

సావిత్రి టీచర్‌కు మరీ ఇష్టం.

మల్లెపువ్వులాంటి నవ్వు

లేడిపిల్లలా చెంగు చెంగున ఎగురుతుంది.

కోయిలలా కమ్మగా పాడుతుంది.

నెమలిలా నాట్యం చేస్తుంది.

చిలుకలా కమ్మగా మాట్లాడుతుంది.

అందరి తలలో నాలుకలా ప్రియాంక.

అందుకే ప్రియాంకంటే అందరికి అంతిష్టం.

నవ్వితే నవరత్నాల్లా తళతళ మెరిసే పండ్లు. చేపపిల్లలా మిలమిల మెరిసే కండ్లు. పొడవాటి రెండుజడలు. చెవులకు రింగులు; కాళ్లకు పట్టీలు, నుదుట తిలకం బొట్టు. స్కూల్‌డ్రెస్సులో ప్రియాంకను చూడాలంటే రెండు కండ్లు చాలవు. వెరసి కడిగిన ముత్యంలా వుంటుంది. ఆ స్కూల్లో అందరికంటే బాగా చదువుతుంది. చదువేగాదు ఆడుతుంది, పాడుతుంది. రంగురంగుల బొమ్మలు వేస్తుంది. కంప్యూటర్ టకటకలాడిస్తుంది. పిల్లలకోడిలా పిల్లలందరిని తన వెంట తిప్పుకుంటుంది. ఆ స్కూలుకు ఓ టీమ్ లీడర్‌లా ఆకాశంలో తళతళ మెరిసే నక్షత్రంలా మెరిసిపోతుంది.

మాదిగవాడలో మాదిగ మైసయ్య కూతురు ప్రియాంక. రకరకాల తోలు చెప్పులు చేయడంలో చుట్టూ పదూర్లలో మైసయ్యకు మంచి పేరుంది. తండ్రి చెప్పులు చేస్తూ తల్లి కూలి చేస్తూ హాయిగా లాక్కొస్తున్న ఆ కుటుం బంలో అనుకోని అవాంతరం వచ్చిపడింది. అకస్మాత్తుగా మైసయ్య పక్షవాతంతో మంచాన పడ్డాడు. ఇంటి పెద్ద దిక్కు మూలపడి నడిసంద్రంలో తుఫానులో చిక్కిన ఓడలా తయారయింది ఆ కుటుంబం పరిస్థితి. అయినా ప్రియాంక తల్లి భూలక్ష్మమ్మ ఏ మాత్రం జంకలేదు.

చాలామంది ప్రియాంకను బడి బందుచేసి తనతోపాటు కూలికి తీసుకుపోమన్నారు. భూలక్ష్మమ్మ ససేమిరా అన్నది. తనలా నిరక్షరకుక్షిలా కాకుండా తన కూతురు బాగా చదువుకోవాలనుకుంది. ప్రియాంక బడిమాన్పించలేదు. దీనికి తోడు ప్రియాంక అనంవత్సరం ఏడవ తరగతి పరీక్షల్లోమంచి మార్కులు తెచ్చుకొని మండల టాపర్‌గా నిలిచింది. ఏడవ తరగతిలో మంచిమార్కులు తెచ్చుకున్న ప్రియాంక అభినందన సభను ఆ పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఆ సభలో యం.యల్.ఏ.,డి.ఇ.వో., ప్రధానోపాధ్యాయులు రామచంద్రయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు. అందరు ప్రియాంకను అభినందించారు. విద్యార్థులంతా ప్రియాంకను ఆదర్శంగా తీసుకొని మంచి మార్కులు తెచ్చుకోవాలని కోరారు. ప్రియాంక కలెక్టరో, డాక్టరో, ఇంజనీరో అయి ఈ ఊరికి మంచి పేరు తెస్తుందని వక్తలంతా పొగిడారు.

ప్రియాంక వుంటున్న మాదిగ వాడలో దాదాపు ఓ యాభై కుటుంబాలు నివసిస్తున్నాయి. అంతా రెక్కాడితే డొక్కాడే బడుగు బలహీనవర్గాలవారే. ఆ వాడలో చదువుకున్నవాళ్లు పట్టుమని పదిమందికూడా లేరు. ఆడవాళ్లయితే చదువు వచ్చినవాళ్లు అసలులేరు. తల్లిదండ్రులతో పాటు పిల్లలు కూడా జీతాలకు, కూలిపనులకు, బాలకార్మికులుగా పని చేస్తున్నారు. ఎప్పుడయితే ప్రియాంకకు పాఠశాలలో జరిగిన సన్మాన కార్యక్రమం చూశారో వాళ్లంతా తమ పిల్లలను కూడా చదివించుకోవాలనుకున్నారు. దానికి తోడు ప్రియాంక తనచెల్లి, తమ్మునితో సహా తమవాడలోని ఓ యాభయిమంది పిల్లలను బడికి వచ్చేట్లు చేసి ఉపాధ్యాయులచే భేష్ అనిపించుకుంది. సంపూర్ణ అక్షరాస్యతా కార్యక్రమంలో తను వాలెంటీర్‌గా ఓ పదిమంది మహిళలను అక్షరాస్యులుగా మార్చి అధికారుల అభినందనలు అందుకొన్నది.

ఆ స్కూల్లో ఏ పరీక్ష జరిగినా ప్రియాంకదే ఫస్ట్ మార్క్. రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొని తాము తయారుచేసిన ఆర్టికల్ ద్వారా స్కూలుకు ప్రథమ బహుమతి సాధించుకొచ్చింది. మండల స్థాయి ఆటల పోటీలో స్కూలుకు ప్రయిజు సంపాదిం చింది. ఆటల్లో, పాటల్లో, చిత్రలేఖనంలో ప్రియాంక ఏ పోటీలో పాల్గొన్నా ప్రయిజు రావాల్సిందే. అందుకే హెడ్‌మాస్టర్‌తో సహా ఉపాధ్యా యులందరికి

ప్రియాంకంటే అంతులేని అభిమానం.

సావిత్రి టీచర్‌కు ప్రియాంకంటే ప్రాణం. స్వంత కూతిరిలా చూసుకుంటుంది. ఒక్కరోజు ఆ అమ్మాయి బడికి రాలేదంటే విలవిలలాడిపోతుంది. ఏవేవో పుస్తకాలు తెచ్చి ఇస్తుంది. తెలియని విషయాలెన్నో చెబుతుంది. పోటీపరీక్షలు రాపిస్తుంది. ప్రియాంక ఇంటి పరిస్థితులు తెలుసుగనుక, గతంలో ప్రియాంక చిరిగిపోయిన బట్టలతో స్కూలుకు రావడం చూసిన సావిత్రి టీచర్ సంవత్సరానికి రెండు జతల స్కూల్‌డ్రెస్సులు తెచ్చి యిస్తుంది. షూ, కంపాక్స్, ప్రియాంకకు ఏదవసరమయినా టీచరే తెచ్చియిస్తుంది.

"చీకటితో లేచి తల్లికి అసరాగా ఇంటి పనంతా చేసుకుని తమ్ముణ్ణి, చెల్లెను, తమవాడ పిల్లలనంతా వెంటేసుకుని బడికివస్తుంది. ఏది చెప్పినా కరంటులా అంటుకుపోతుంది. ఒక్కసారి మనం చెప్పిన విషయం మనం మరచిపోయినా ఈ ప్రియాంక రెండు సంవత్సరాల తర్వాతయినా ఇట్టే చెప్పేస్తుంది. మన పిల్లలకు అన్నీ వున్నా చదువుకోమని మనం ఎంత మొత్తుకున్నా అత్తెసరు మార్కులే?"- హెడ్ మాస్టర్ రామచంద్రయ్య "ఏరి కూర్చిన ముత్యాల్లాంటి అక్షరాలు. ఒక్క తప్పుంటే వొట్టు. ఆ అక్షరాలు, ఆ రాత చూస్తేనే ఎన్ని మార్కులయినా వేయాలనిపిస్తుంది". తెలుగు మాస్టర్ చలపతిరెడ్డి. "మట్టిలో మాణిక్యం అశారదాదేవి ఆ అమ్మాయి నాలుకమీదే నాట్యం చేస్తుంది. అందరికీ అబ్బుదు. ఈ అమ్మాయి పూర్వజన్మ సుకృతం".

"బోర్డుమీద లెక్క మొదలు పెడితే చాలు. మనం ఇటు తిరిగేసరికే లెక్క చేశాసార్ అంటుంది" లెక్కల టీచర్ చైతన్యం.

"చూడండి ఈ అమ్మాయి ఈ సంవత్సరం ట్రిపుల్ ఐ.టి సీటుగ్యారంటీగా కొట్టేస్తుంది. పోయిన సారి సీటొచ్చిన రాముకంటే ఈ ప్రియాంక ఇంకా స్పీడు"- సావిత్రి టీచర్.

ప్రియాంక గురించి ఉపాధ్యాయులు వ్యాఖ్యానాలు.

ప్రియాంక దృష్టంతా చదువు మీదే "ఈ సంవత్సరం పదవతరగతిలో మంచి మార్కులు తెచ్చుకొని ట్రిపుల్ ఐ.టి సీటు సంపాదించాలి. మంచి ఉద్యోగం సంపాదించి తమ్ముణ్ని, చెల్లెను బాగా చదివించాలి. రోగిష్టి తండ్రికి మంచి వైద్యం చేయించాలి. తల్లి కష్టపడకుండా చూడాలి. తమ స్కూలుకి, తమ ఊరికి మంచి పేరు తేవాలి". ఇవి ప్రియాంక ఆలోచనలు.

"ఈ ఈఅమ్మాయి బాగా చదివి మీ స్కూలుకు, మీ వూరికి మంచి పేరు తెస్తుంది". గతంలో డి.ఇ.వో అన్న మాటలు ప్రియాంక చెవుల్లో మారుమోగుతున్నాయి.

ప్రభుత్వం ఈ మధ్య గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతిభగల విద్యార్థులకు ట్రిపుల్ ఐ.టిలో ప్రవేశం కల్పిం చింది. ఉన్నత చదువులు చదువుకోలేని పేద గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఈ పథకం వరంలా మారింది. పదవ తరగతిలో ఎక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులకు మార్కుల ప్రాతి పదికన సీట్లు కేటాయిస్తారు. ఏలాంటి పైరవీలకు ఆస్కారం లేదు. గ్రామీణ ప్రాంత పాఠశాలలో చదివే విద్యార్థులకు ఎక్కువగా ఎనభై శాతం సీట్లు కేటాయించారు. ట్రిపుల్ ఐ.టి. కోర్సు పూర్తి అయ్యేవరకు అన్ని ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుంది.

ఉపాధ్యాయులంతా తమ స్కూలు రికార్డు బాగా రావాలని, ప్రయివేటు క్లాసులు, రాత్రి క్లాసులు తీసుకున్నారు. సిలబసంతా పూర్తి చేశారు. అక్కడ పనిచేసే ఉపాధ్యాయులంతా జిల్లా కేంద్రంనుండి వచ్చిపోయేవాళ్లే. ఫిబ్రవరిలో ప్రీ ఫైనల్ పరీక్షలయ్యాయి. ప్రియాంకకు అన్నిట్లో తొంభైకి పైగా మార్కులు వచ్చాయి. గణితంలో నూటికి నూరు మార్కులొచ్చాయి.

మార్చిలో పదవతరగతి పబ్లిక్ పరీక్షలు మొదలయ్యాయి. విద్యార్థులంతా రాత్రింబవళ్లు కష్టపడి పరీక్షలు రాశారు. ప్రియాంక బాగా చదివి అన్ని పరీక్షలు బాగా రాసింది. ఆ స్కూలు పిల్లలంతా ఫస్ట్ క్లాసులో పాసవుతామన్నారు. పరీక్షలయిపోయి ఉపాధ్యాయులు పిల్లలు హాయిగా ఊపిరి పీల్చుకున్నారు.

ఓ నెల రోజుల తర్వాత పదవతరగతి పరీక్షా ఫలితాలు వచ్చాయి. మార్కులు ఇంటర్‌నెట్‌లో వచ్చాయి. ప్రియాంకకు ఐదువందలనలుబయి మార్కులు వచ్చాయి. ఆ స్కూల్లో గతంలో అన్ని మార్కులు ఎవరికి రాలేదు. ఆ స్కూల్లో ముప్పయిమూడుమంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ముప్పయిమంది విద్యార్థులు ఫస్ట్ సెకండ్ క్లాసులలో పాసయ్యారు. ముగ్గురే ఫెయిలయ్యారు. తొంభై శాతం రిజల్ట్ వచ్చింది. గ్రామస్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆనందంలో మునిగితేలారు. ప్రియాంకకు మంచి మార్కులు వచ్చినందుకు ఉపాధ్యాయులంతా అభినందించారు. ట్రిపుల్ ఐ.టి సీటు గ్యారంటీ అన్నారు. సావిత్రి టీచర్ ఏకంగా స్వీట్లు తెచ్చి అందరికి పంచింది.

తీరా చూస్తే ట్రిపుల్ ఐ.టి సీటు ఆ స్కూలునుండి ఐదువందల నలభై ఒక్క మార్కులతో సింధూజ పేరు వచ్చింది. ఆ పేరు చూచి విద్యార్థులు ఉపాధ్యాయులు అయోమయంలో పడ్డారు. ఎవరీ సింధూజ? తమ స్కూల్లో ఆ పేరుగల అమ్మాయి ఎవరు లేరు. మరి ఈ పేరు ఎలా వచ్చింది. ప్రియాంకకు వస్తదనుకున్న ట్రిపుల్ ఐ.టి సీటు ఈ అమ్మాయి కెలా వచ్చింది. అంతా ఆలోచనలో పడ్డారు.

ఏతావాతా తేలిందేమంటే ప్రియాంక కంటే ఒక్కమార్కు ఎక్కువ వచ్చి ట్రిపుల్ ఐ.టికి సెలక్టయింది. హెడ్‌మాస్టర్ రామచంద్రయ్యకూతురేసింధూజ, ఇక్కడే హెడ్‌మాస్టర్ రామచంద్రయ్య ఓట్రిక్ప్లే చేశాడు. గుట్టుచప్పుడు కాకుండా తన కూతురు సింధూజ పేరును జూన్‌లోనే పదవతరగతిలో చేర్చాడు. పదవతరగతి క్లాస్ టీచర్ తనే గనుక ఆ రిజిస్టర్ ఎప్పుడూ తన బీరువాలోనే వుంటుంది. రోజూ హాజరు వేస్తూ వచ్చాడు.

సింధూజ చదివేది జిల్లా కేంద్రంలో సెయింట్ జోసఫ్ కార్పోరేట్ ప్రయివేట్ పాఠశాల. అది జిల్లాలోనే పేరున్న ప్రయివేటు పాఠశాల. అందులో చదివే పిల్లలంతా నువ్వా! నేనా అని పోటీ పడి చదువుతారు. అది పట్టణ ప్రాంత ప్రయివేటు పాఠశాల గనుక అక్కడయితే తన కూతురు సింధూజకు ట్రిపుల్ఐ.టిలో సీటు రావడం కష్టం అనుకున్నాడు హెడ్‌మాస్టర్ రామచంద్రయ్య. అందుకే తెలివిగా తనకూతురు పేరును తన స్కూల్లో నమోదు చేసి హాజరు వేస్తూ వచ్చాడు. పబ్లిక్ పరీక్ష ఫీజు కూడా ఇదే స్కూలు నుండి కట్టించి పరీక్ష రాయించాడు.

ప్రియాంకకు రావలసిన ట్రిపుల్ ఐ.టి సీటు ఒక్క మార్కు ఎక్కువ వచ్చిన సింధూజకు వచ్చింది. కంచే చేను మేసినట్లు గుడిని, గుడిలింగాన్ని మింగిన పూజారిలా, కంటిని కనురెప్ప కాటేసినట్లు ప్రియాంకకు రావలసిన ట్రిపుల్ఐ.టి సీటు సింధూజ తన్నుకుపోయింది.

## సవరణ

ఆగస్టు-2009 'చినుకు' పత్రికలో బాల సాహిత్యం శీర్షికన వై.కె. మూర్తి పేరుమీద వచ్చిన 'జాతీయ జెండా' కవిత ఆగస్టు - 2004లో చెన్నై నుండి ప్రచురితమయ్యే'ఆటవిడుపు' మాసపత్రికలో గొల్లాపిన్ని సుబ్రమణ్యశర్మగారు వ్రాసినది. హామీ పత్రంతో సహా ఆ కవితను పంపించిన వై.కె. మూర్తిగారు తన పొరపాటును తెలుసుకొని క్షమాపణను లిఖిత రూపంగా మన పత్రికకు, ఆ రచయితకు పంపించారు.

మన పత్రికలో జరిగిన ఈ పొరపాటుకు చింతిస్తూ... తమవైన రచనలు మాత్రమేపంపిస్తూ, రచయితలు హామీ పత్రాన్ని తప్పనిసరిగా జత చేయవలెను.

- ఎడిటర్, చినుకు మాసపత్రిక